క్లుప్తంగా

అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన విభాగం సీఈఓ శ్రీనివాసరావు తెలిపారు. మాచవరం గురుకుల కళాశాలలో గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. యువజన విభాగం ఏర్పాటుచేసిన వ్యక్తిత్వ వికాసంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు జగదీష్ ఉపన్యాసం ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ, అధ్యాపకులు బాలకృష్ణ, అరుణ, లావణ్య, సుమిత్ర పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు భోజనాల ఏర్పాటు



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐజీఎంసీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ తమ వంతు సాయం అందించింది. అందులో భాగంగా క్రీడల్లో పాల్గొన్న 500 మందికి మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రామభక్తి సామ్రాజ్యాన్ని చాటిన సంకీర్తనలు

విజయవాడకల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న 31వ వార్షిక సంగీతోత్సవాలు రామభక్తి సామ్రాజాన్ని చాటుతున్నాయి. గురువారం నాటి కార్యక్రమంలో ప్రముఖ వేణువు విద్వాంసులు హేరంబ్, హేమంత్ సోదరులు హృద్యంగా కృతులను ఆలపించారు. బీవీ దుర్గాభవాని వయోలిన్‌పై, ఏఎస్ ఫల్గుణ్ మృదంగంపై, హరిబాబు ఘటంపై సహకరించారు. సభ్యులు గాయత్రీ గౌరీనాథ్, ఎం.శారదా దీప్తి, అంజనీకుమార్, పి.మురళీకృష్ణ పాల్గొన్నారు. సంగీత విద్వాంసులను, కార్యక్రమానికి సహకరించిన డాక్టర్ కేబీఎస్ఎన్ ప్రసాద్, డాక్టర్ లలితా మాధవిలను నిర్వాహకులు సత్కరించారు.

కరాటే జాతీయ పోటీలకు విజయవాడ క్రీడాకారులు



విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్జీఎఫ్ఐ) జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో విజయవాడ క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. వీరిని జేకే గుజూర్యో అకాడమీ నిర్వాహకులు జె.శ్రీనివాసులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 24, 25 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్థానిక క్రీడాకారులు టి.తేజశ్రీసాయి, డి.ముఖేష్‌రెడ్డి, కె.వసుధ, షేక్ అఫ్రిన్‌షహనాజ్, ఎస్.జెనిత్, టి.హర్షిత, ఆర్.పి.శౌర్య సత్తా చాటి పతకాలు సాధించడంతో పాటు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు గత కొన్నేళ్లుగా జేకే గుజూర్యో అకాడమీలో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. సీనియర్ క్రీడాకారులు మహేష్, సాయికుమార్, మధుసూదనరావు, దినేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 23 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 23 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు గురువారం జరిమానా విధించారు. 4వ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి మోటారు వాహనాలు నడుపుతున్న 23 మంది పట్టుబడ్డారు. వీరిని కోర్టులో న్యాయమూర్తి వద్ద హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, 20 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

నేటి నుంచి ఘంటసాల జయంతి ఉత్సవాలు

విజయవాడకల్చరల్: ఆల్ ఇండియా ఘంటసాల చైతన్యవేదిక ఆదిలీలా ఫౌండేషన్, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఘంటసాల జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఘంటసాల సినీ సంగీత విభావరి, ఘంటసాల అభిమానులతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. 29న హనుమంతరాయ గ్రంథాలయం, 30న తుళ్లూరు, డిసెంబర్ 1న విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరుల్లో సదస్సులు జరుగుతాయని కార్యదర్శి చింతకాయల చిట్టిబాబు తెలిపారు.

నేడు వీఎంసీ కౌన్సిల్

- 175 అంశాలతో కౌన్సిల్ అజెండా
- 24 ప్రశ్నలపై జరగనున్న కౌన్సిల్
- పలు పనులకు ప్రతిపాదనలు సిద్ధం



వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు (ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ శుక్రవారం జరుగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారుల నుంచి మొత్తం 175 అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది.

ప్రధానాంశాలు..

- జక్కంపూడి హౌసింగ్ కాలనీలో ప్రతి నిత్యం పారిశుద్ధ్య నిర్వహణకు 41 మంది కార్మికులు యశ్వంత్ ఫెసిలిటీ సర్వీసెస్ ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. వీరి కాంట్రాక్ట్ ఈ ఏడాది ఆగస్టుతో ముగిసినందున కాంట్రాక్ట్‌ను మరో ఏడాది పాటు పొడిగించటం, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనంగా ఏడాదికి రూ.1.03 కోట్లు వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించేలా కౌన్సిల్‌కు ప్రతిపాదన వచ్చింది. దీనిపై సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- సర్కిల్ – 3 పరిధిలోని 9వ డివిజన్‌లో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్డుకు అనుగుణంగా ఉన్న డ్రెయిన్‌ను నిర్మించేందుకు రూ.65.95 లక్షలు, 8వ డివిజన్‌లో 5, 13 బస్ రూట్‌లో ఉన్న డ్రెయిన్‌ను పునరుద్ధరించేందుకు అవసరమైన రూ.93.08 లక్షలు వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు చేయాలి. ఈ ప్రతిపాదనపై సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.
- విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆధునీకరించేందుకు, అందులో అవసరమైన ఆధునీకరణ పరికరాలను అమర్చేందుకు అవసరమైన రూ.2 కోట్లను వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి విడుదల చేయాలి. ఈ ప్రతిపాదనపై సభ్యులు చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రశ్నోత్తరాలు..

- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల, అంచనాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, పూర్తయిన పనులపై సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నించనున్నారు.
- వీఎంసీలో ఉన్న సర్దుబాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వారి విద్యార్హత తదితర వివరాలతో పాటు ఎంత మంది శానిటరీ మేస్త్రీలు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు ? హెల్త్ అసిస్టెంట్ అర్హత కలిగిన వారికి పదోన్నతి కల్పించారా అనే అంశంపై సభ్యులు ప్రశ్నించనున్నారు.
- వీఎంసీలోని రెవెన్యూ, ఎస్టేట్స్, పట్టణ ప్రణాళిక విభాగం, ప్రజారోగ్య విభాగంపై కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులు, వాటి పూర్తి వివరాలపై చర్చ జరుగనుంది.
- ఇటీవల వచ్చిన బుడమేరు వరదపై చర్చ జరుగనుంది. వీఎంసీ ఎందుకు నగర ప్రజలను అప్రమత్తం చేయలేదు, బుడమేరు వరద నష్టం ఎంత, బాధితులకు అందించిన పరిహారం, రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులను ఆదుకున్న సహాయంపై సభ్యులు ప్రశ్నించనున్నారు.

నవయుగ వైతాళికుడు జ్యోతిరావు పూలే

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విష్ణు, శ్రీశైలజ, నాయకులు



నివాళులర్పించిన ఎమ్మెల్యే ఉమా, బీబీఏ ప్రతినిధులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశంలో అక్షర జ్యోతిని వెలిగించిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనం నందు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, నాయకులతో కలిసి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం ఘన నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని మల్లాది విష్ణు కొనియాడారు.

స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేనంతగా ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం పాటించి వైఎస్ జగన్ జాతీయ స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించారని విష్ణు చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేసిందని విమర్శించారు. చంద్రబాబు తొలి సంతకం పెట్టిన డీఎస్సీకి అతీగతీ లేదని.. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ పథకాల ఊసే లేదన్నారు. ఆరు నెలల పాలనలో ఒక్క హామీని నిలబెట్టుకోకపోగా 60 వేల కోట్లకు పైగా అప్పులు తెచ్చారని.. ఇదేనా సంపద సృష్టి అంటూ ఎద్దేవా చేశారు. కూటమి నేతలకు జమిలీ ఎన్నికల భయం పట్టుకుందని.. త్వరలోనే ఈ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమని అభిప్రాయం వ్యక్తం చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ.. విద్యతోనే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయన్న పూలే ఆలోచన విధానమే స్ఫూర్తిగా.. ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. నాయకులు యరగొర్ల శ్రీరాములు, వెన్నం రత్నారావు, అక్బర్, పసుపులేటి యేసు, తోపుల వరలక్ష్మి, పేరం త్రివేణిరెడ్డి, వెంకటేశ్వరమ్మ, ఇస్మాయిల్, కురిటి శివ, మీసాల సత్యనారాయణ, ఆర్.ఎస్.నాయుడు, ప్రబల శ్రీనివాస్, ఎం.ఎస్.నారాయణ, ప్రేమ్ పాల్గొన్నారు.

బీబీఏ ఆధ్వర్యంలో పూలేకు నివాళి

విజయవాడస్పోర్ట్స్: సమాజంలో కులవివక్ష, అసమానతలు రూపుమాపడానికి మహాత్మా జ్యోతిరావు పూలే అలుపెరుగని పోరాటం చేశారని సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా అన్నారు. సివిల్ కోర్టుల ప్రాంగణంలోని బీబీఏ హాల్‌లో గురువారం జరిగిన పూలే వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బీబీఏ అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీబీఏ ప్రతినిధులు చెరుకూరి శ్రీపతి, చలసాని అజయ్‌కుమార్, గురునాథం, నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌పై కక్ష సాధింపు



నజీర్ షాపు ముందు అరుగును ధ్వంసం చేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నాడని అధికార పార్టీ నేతలు ఓ చిరు వ్యాపారిపై కక్షబట్టారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టౌన్‌ప్లానింగ్ అధికారుల ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 25వ డివిజన్ అరండల్‌పేటలో అబ్దుల్ నజీర్ సెల్ ఫోన్ మెటీరియల్ షాపు నిర్వహిస్తున్నాడు. అతను సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకులు అతని షాపు ముందు కాలువపై వేసిన నాపరాయితో వేసిన అరుగును ధ్వంసం చేశారు. షాపులోకి వెళ్లకుండా పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ షాపునకు ఇరువైపులా దుకాణాలు ఉన్నా వాటి జోలికి వెళ్లకుండా కేవలం నజీర్ సెల్ షాపు ముందు మాత్రమే సుత్తులతో కాలువను మూసివేస్తూ వేసిన నాపరాయి అరుగును ధ్వంసం చేసి కక్షసాధింపులకు పాల్పడ్డారు. దీనిపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు బంకా భాస్కర్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ప్రశ్నించడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభం







ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2024 విజయవాడలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం ప్రారంభమైంది. కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్(డిస్కస్ త్రో, షార్ట్ పుట్, రన్నింగ్, రిలే) క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









ఘనంగా ఎస్ఆర్ఆర్ కళాశాల వార్షిక వేడుకలు

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డెప్యూటీ కలెక్టర్ వెన్నెల శ్రీను తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ కళాశాలలు ఎందులోనూ తక్కువ కాదని... ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించి ఎంతో మంది అత్యుత్తమ స్థానాలకు చేరుకున్నారని డెప్యూటీ కలెక్టర్ వెన్నెల శ్రీను అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 87వ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన కళాశాలలో చదువుకునే అవకాశం లభించటం విద్యార్థుల అదృష్టంగా భావించాలని సూచించారు. విశిష్ట అతిథి రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఎం.బ్రహ్మజీరావు మాట్లాడుతూ తాను ఇక్కడే చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. విద్యకు పేదరికం అడ్డంకి కాదని, ప్రభుత్వ కళాశాలల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కళాశాల ప్రగతిని వివరించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, డాక్టర్ జే నాగేశ్వరరావు, డాక్టర్ సుధాకర్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ డీవీఎస్వీ బాల సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు.

బీసీల సమస్యలపై పోరాటం కొనసాగిస్తాం



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని బీసీల సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలను ఏకతాటిపైకి తీసుకొస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ అన్నారు. మహాత్మాజ్యోతిరావు పూలే స్ఫూర్తితో సమస్యలపై పోరాడుతామన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దుర్గా నరేష్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీల నియమిస్తామన్నారు. బీసీల సమస్యలపై పోరాడేవారికే అవకాశం కల్పిస్తామన్నారు. బీసీల సమస్యల పరిష్కార దిశగా ముందుకెళ్తామని చెప్పారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకలమ్మ మాట్లాడుతూ.. బీసీ హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర నాయకులు చింతా శ్రీను, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి భీమవరపు హేమ, కృష్ణాజిల్లా అధ్యక్షుడు రంగు విక్రమ్, విజయవాడ నగర అధ్యక్షుడు కిరణ్, మెండెం జ్యోతి, శారదా తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు





స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సాంకేతిక రంగంలో వచ్చే సమస్యలతో జాగ్రత్తగా మెలగాలి



వెబినార్‌లో మాట్లాడుతున్న వక్తలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో అంతకంతకూ విస్తరిస్తున్న సమస్యలపై యువత జాగ్రత్తగా మెలగాలని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం సాంకేతికతవల్ల యువత ఎదుర్కొనే సవాళ్లపై వెబినార్ సదస్సు జరిగింది. నూతన సాంకేతికత వల్ల ఎదుర్కొంటున్న సవాళ్లను ఆమె వివరించారు.

బానిసలు కాకూడదు..

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం సహా ఆచార్యులు డాక్టర్ వి.పెర్సిస్ ముఖ్య అతిథిగా పాల్గొని సాంకేతికత రంగంలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, పాటించవలసిన జాగ్రత్తలను సోదాహరణంగా వివరించారు. విద్యార్థులు ఫోన్లు, కంప్యూటర్లు తదితర సాంకేతిక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలేగానీ వాటికి బానిసలు కాకూడదన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు లావణ్య, నాగలక్ష్మి, దివ్య, బాలకృష్ణ, అరుణ, సుధారాణి, సుమిత్ర, సత్యవాణి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

1న ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సీఎస్ఐ కాంప్లెక్‌లో ఉన్న వైష్ణవి ఆర్థో అండ్ పెయిన్ క్లినిక్ నందు డిసెంబర్ 1న ఉచిత ఎముకల సాంద్రత(బీఎండీ – బోన్ మినరల్ డెన్సిటీ) పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్సా నిపుణులు డాక్టర్ కె.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. శిబిరంలో రూ.2 వేలు విలువ గల బీఎండీ స్కాన్ ఉచితంగా చేస్తామని తెలిపారు. ఈ స్కాన్‌లో ఎముకల్లోని కాల్షియం లెవల్, మినరల్స్‌తో పాటు ఎముకలు, కండరాల నొప్పులకు కారణాలు తెలుసుకోవచ్చన్నారు. 99513 77754 నంబర్‌లో సంప్రదించాలని డాక్టర్ సుధాకర్ చెప్పారు.

- **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 11 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ మెయిన్ రోడ్డు, లారీల బజార్, కృష్ణాహోటల్ సెంటర్, వాటర్ ట్యాంక్ రోడ్డు, యార్డ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్ర బాబు గురువారం తెలిపారు.